క్లుప్తంగా

ఆదిరెడ్డిని పరామర్శించిన చింతలచెరువు


ఆదిరెడ్డిని పరామర్శిస్తున్న చింతలచెరువు

కనిగిరిరూరల్(హనుమంతునిపాడు): అనారోగ్యంతో బాధపడుతూ విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాల ఆదిరెడ్డిని రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సౌజన్య బాధ్యతల స్వీకరణ


టంగుటూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ సౌజన్య

టంగుటూరు: పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి. సౌజన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బాధ్యతలు స్వీకరించారు. కళాశాల ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న జడ ఎలిషా

కొండపి: క్రిస్మస్‌ను పురస్కరించుకొని మండలంలోని పెరిదేపిలో గ్రామవాసి జడ ఎలీషా వృద్ధ మహిళలకు, పురుషులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు, కుష్టు రోగులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. అంగలకుర్తి చిన్న బ్రహ్మయ్య, మల్లెల పెద్ద పేతురు, మల్లెల చిన్న పేతురు, అంగలకుర్తి బాబు పాల్గొన్నారు.

తోటల్లో వర్షం నీరు బయటకు పంపాలి


కాకుటూరివారిపాలెంలో పొగాకు తోటను పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి

టంగుటూరు: పొగాకు తోటల్లో వర్షం నీటిని బయటకు పంపాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున పొగాకు పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపాలన్నారు. బొబ్బ తెగులు ఉన్నందున ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులతో బొబ్బ తెగులు సోకే ప్రమాదం ఉన్నందున బ్లైటాక్స్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. రైతులు అనధికారికంగా పొగాకు బ్యారన్లు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీగా అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న కనిగిరి డీఎస్పీ, సీఐ

పామూరు: మండలంలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని కనిగిరి డీఎస్పీ ఎం మహేశ్వరరావు అన్నారు. కనిగిరి నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి రికార్డుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. మండలంలో పెండింగ్ కేసులపై సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబును అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని, చోరీలు జరగకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. అక్రమ మద్యం, కోడిపందేలు, పేకాట, డ్రగ్స్ మొదలైన వాటిపై కఠినంగా ఉండాలని, మెరుగైన సేవలతో ప్రజలకు దగ్గరగా ఉండాలని సీఐ, ఎస్సైలకు సూచించారు.

చేతికందే సమయంలో..!

- నీట మునిగిన మినుము, శనగ పంటలు
- వర్షం లేత పంటలకు మేలు..ముదురు పంటలకు నష్టం
- రెండు రోజులుగా ఓమోస్తరు వర్షం
- కాయదశలో ఉన్న కంది, మినుము పంటలకు దెబ్బ
- నాణ్యత లేని లోగ్రేడ్ పొగాకు దిగుబడికి అవకాశం
- వర్షంతో అన్నదాతలకు తీవ్ర నష్టం


మంగపతివారిపాలెంలో శనగ పంటలో నిల్వ ఉన్న వర్షం నీరు

పొన్నలూరు:

అతివృష్టి, అనావృష్టి ఏటా అన్నదాతలను వెంటాడుతుంది. ఆరుగాలం శ్రమించి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు చేతికి అందుతాయన్న తరుణంలో ప్రకృతి ప్రకోపానికి పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షం కురుస్తోంది. దీంతో లేత పంటలకు అనుకూలంగా ఉండగా ముదురు పంటలకు నష్టం చేకూరే అవకాశం ఉంది. ఏపుగా పెరిగి కాయదశలో ఉన్న కంది పంట, మినుము పంటలు కూడా కొంత మేరా పూత రాలిపోయి చెట్లన్ని నేలకొరిగాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన కంది, మినుము, కొర్ర, పత్తి వంటి ముదురు పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. వాస్తవంగా ఈ ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ప్రస్తుతం పూర్తిగా చేతికందే దశలో ఉన్నాయి. ఇటువంటి సమయంలో వర్షం పడటంతో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా పొలంలో నీళ్లు నిలవడంతో మినుము, కొర్ర వంటి పంటలు నానిపోతున్నాయి. ఈ వర్షంతో లేత పంటలకు పెద్దగా ఇబ్బందులు లేకున్నా ముదురు పంటలకు మాత్రం నష్టం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది.

లోగ్రేడ్ పొగాకు వచ్చే అవకాశం...

ఈ ఏడాది కొంత వరకు సకాలంలో వర్షాలు పడటంతో రైతులు అన్ని రకాల పంటలను సాగుచేశారు. ముఖ్యంగా పొగాకు పంటను పరిమితంగా సాగుచేయాలని సంబంధిత అధికారులు అవగాహన కల్పించినా వర్షాలు అనుకూలించడంతో ఈ ఏడాది ఎక్కువగా పొగాకు పంటను సాగు చేశారు. అయితే పంట అనుకూలంగా ఉందనుకునే సమయంలో వర్షం పడటంతో ఆకులపై ఉండే మడ్డీ పోయి లోగ్రేడ్ పొగాకు దిగుబడే వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో పొగాకు పనులు ప్రారంభమయ్యాయి. ఇటువంటి సమయంలో వర్షం పడటం వలన పొలంలో తేమ ఉండటం వలన సకాలంలో ఆకులు రాల్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో ముదురు ఆకులు ఎరుపుకు తిరిగి చెట్టునే ఎండిపోతాయి.

పూతరాలిన కంది...

ప్రస్తుతం కంది పంట పూర్తిగా పూత వచ్చి కాయదశలో ఉంది. గత అక్టోబర్, నవంబర్‌లో కురిసిన అడపాదడపా వర్షాలకు జీవం పోసుకున్న కంది పంట రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో దెబ్బతిన్నాయి. చాలా గ్రామాల్లో వర్షానికి ఏపుగా పెరిగిన కంది చెట్లు వంగిపోయి నేలకొరిగాయి. చాలా వరకు చెట్టుకు ఉన్న పూత రాలిపోయింది. దీంతో దిగుబడి తగ్గి ఈ ఏడాది కూడా కందిసాగు పెద్దగా రైతులకు కలిసొచ్చే అవకాశం లేకుండా పోయింది. అలాగే ముదురు, మినుము, శనగ పంట కూడా పూత దశలో ఉండి వర్షానికి దెబ్బతింది. మొత్తంగా పంటలు చేతికందే సమయంలో వర్షాలు పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు.

మండలంలో సాగుచేసిన పంటల వివరాలు...

సాగుచేసిన ప్రధాన పంటలు	ఎకరాలు
పొగాకు	11000
కంది	1000
మినుము	520
మిరప	300
వేరుశనగ	200
శనగ	980
వరి	250


చెన్నిపాడులో నేలకొరిగిన కాయదశలో ఉన్న కంది పంట

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి:



ఈ ఏడాది పంటల సాగు ఆశాజనకంగానే ఉన్నా అడపాదడపా వర్షానికి ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది, మినుము వంటి పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. పూత దశలో ఉండటంతో వర్షాలకు రాలిపోయి దిగుబడులు తగ్గుతాయి. పొగాకు కూడా నాణ్యత లేని లోగ్రేడ్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పొలంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. అలాగే తెగుళ్ల సోకే అవకాశం ఉండటంతో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

టి. పూర్ణచంద్రరావు, ఏఓ, పొన్నలూరు

రెవెన్యూ సదస్సుకు 86 అర్జీలు


చిన్నఅవలపాడు సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి


హనుమంతాపురంలో అర్జీలు అందజేస్తున్న రైతులు


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్వాలా నరసింహారావు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని హనుమంతాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 86 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. భూమి ఆన్‌లైన్ చేయాలని 26 దరఖాస్తులు, అదనంగా ఎక్కిన ఆన్‌లైన్లు తొలగించాలని 2, వ్యవసాయ భూమి కోసం45, నివేశన స్థలం కోసం 4, దేవదాయ శాఖకు ఒకటి అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. మండల సర్వేయర్ కాకర్ల రమణయ్య, సానికొమ్ము తిరపతరెడ్డి, సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, వీఆర్వో సూరేబోయిన కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిపూడి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 53 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జ్వాలా నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్ 18 అర్జీలు, కరెక్షన్ కోసం 12, రీ ప్లేస్‌మెంట్ కోసం 7 అర్జీలు వచాచయన్నారు. గ్రామసభలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తామన్నారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ బి.శ్రీనివాసరావు, ఈఓ లీలాకృష్ణ, వీఆర్ఓ బడే సాహెబ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): మండలంలోని లింగోజిపురం, చిన్న అలవపాడు గ్రామాల్లో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 15 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సీహెచ్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మ్యూటేషన్ కోసం 11, భూ సర్వే కోసం 3, ఆర్ఓఆర్ కోసం ఒక అర్జీ వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన అర్జీలు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ.పురుషోతంరెడ్డి, మండల సర్వేయర్ వైష్ణవి, వీఆర్వో, వీఆర్ఏ, ఈఎస్‌లు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాయచెరువులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, తహసీల్దార్ వివిధ భూసమస్యల పరిష్కారం కోసం ప్రజలనుండి 28 అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధిక అర్జీలు ఆన్‌లైన్‌కోసం, సర్వే కోసం వస్తున్నట్లు తెలిపారు. మండల సర్వేయర్ బ్రహ్మారెడ్డి, వీఆర్ఓ, బోయమడుగుల సర్పంచ్ బొట్లా చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.


దీజీపేటలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

వైఎస్సార్ సీపీ పోరుబాటను విజయవంతం చేయండి


దద్దాల నారాయణ

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): ప్రజలపై కూటమి ప్రభుత్వం వేసిన విద్యుత్ భారాలను నిరసిస్తూ శుక్రవారం జరిగే వైఎస్సార్ సీపీ పోరుబాటను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఒక్క పైసా కూడా విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.15 వేల విద్యుత్ భారాలు ప్రజలపై మోపడం అన్యాయమన్నారు. పోరుబాటులో భాగంగా శుక్రవారం ఉదయం 10:30 గంటలకు చెక్‌పోస్టు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నియోజకవర్గ నాయకులు, మండల కన్వీనర్లు, మండలస్థాయి, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభియానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహ సారధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దశ దిన కర్మకు హాజరైన బూచేపల్లి


కాకర్లలో నర్సారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వెంకయ్య

మర్రిపూడి: మండలంలోని కాకర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిరెడ్డి రామనర్సారెడ్డి దశ దిన కర్మకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ వెంకయ్య గురువారం హాజరయ్యారు. అలాగే అంకేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పాలుగుండ్ల సుబ్బారెడ్డి తండ్రి పెద నర్సారెడ్డి దశ దిన కర్మలకు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మాదాసి వెంకయ్య హాజరై వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. నాయకులు పల్లెర్ల నరసింహారెడ్డి, జెడ్పీటీసీ మాకినేని సుధారాణి వెంకట్రావు, బోద రమణారెడ్డి, మాజీ చిమట సొసైటీ అధ్యక్షుడు మొల్లల శివరామిరెడ్డి, ఇనునుకొల్లు సుబ్బారెడ్డి, మాకినేని రమణయ్య, టి.రమేష్, సిద్ధయ్య ఉన్నారు.

నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మర్లపాడులో తడిసిన మినుము పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు


వెంకటాయచెరువులో రైతులకు సూచనలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కంది, మినుము, పెసర పంటలు సాగుచేసిన రైతులు పొలాల్లో నీటి నిల్వలు లేకుండా అప్రమత్తంగా మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంకటాయచెరువు గ్రామాల్లో గురువారం పొలంపిలుస్తోంది నిర్వహించి సూచనలు చేశారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, జి.రమాశారద, పి.రవి, షేక్.ఫర్మిన్‌బేగం, వీఏహెచ్ నవీన్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పామూరు: నాన్పుడు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మినుము, పెసర, శనగ రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాలని ఏఓ కంచం రాధ అన్నారు. మండలంలోని చింతలపాలెం, అనుములకొండ, మోట్రావులపాడు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటల్లో నీరు నిల్వలు లేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

పీసీపల్లి: మండలంలోని తలకొండ గ్రామంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకట రమణ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు రైతులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వ్యవసాయాధికారి ప్రకాష్ పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని మర్లపాడులో సాగుచేసిన మినుము పంటను జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఒంగోలు సబ్ డివిజన్ సహాయక వ్యవసాయ సంచాలకుడు రమేష్ బాబు పరిశీలించారు. వర్షాలకు తడిసి గింజలు మొలకలు వచ్చిన పంటలను పరిశీలించారు. కోత దశలో వర్షాలు కురవడంతో రైతులకు పంట నష్టం ప్రాథమికంగా గుర్తించామని, రైతులంతా ఈ విధిగా ఈ పంటలో నమోదు చేయించుకోవాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను ప్రాథమికంగా గుర్తించి నివేదిక ప్రభుత్వానికి పంపుతున్నాము అని తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం


ధ్వజస్తంభం ప్రతిష్టలో పాల్గొన్న చింతలచెరువు, వైస్ ఎంపీపీ, ఇతరులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం వేదమంత్రాల నడుమ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మొదట ఆలయంలో విశిష్ట పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభానికి పూజలు చేసి ప్రతిష్టగాంచారు. ఈసందర్భంగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతీరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న యారవ శ్రీనివాసులు, ఎస్ఓ

పామూరు: కేజీబీవీ విద్యార్థినులు రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని యారవ శ్రీనివాసులు, ఎస్ఓ కటకం సజనలు అన్నారు. స్థానిక కేజీబీవీలో గురువారం ఎస్ఓ సజన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాత రాచూరి యజ్ఞ తన సొంతనిధులతో సమకూర్చిన 10వ తరగతి స్టడీమెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యద్వారానే ఉన్నతస్థితి సాధ్యమని, మెరుగైన లక్ష్యాలను ఎంచుకుని లక్ష్యసాధనదిశగా విద్యనభ్యసించాలని పేర్కొని దాతకు అభినందనలు తెలిపారు. స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్, సచివాలయ సిబ్బంది రాచూరి ఏలియా, బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ తాళ్లూరి సాల్మన్‌రాజు, ఏఓ వాణి, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి దహన సంస్కారాలు


అనాథ మృతదేహానికి దహన సంస్కారాలు చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

టంగుటూరు: టంగుటూరులోని పురం సెంటర్లో ఓ అనాథ మృతదేహానికి సింగరాయకొండకు చెందిన యువనేస్తం ఫౌండేషన్ సభ్యులు గురువారం దహన సంస్కారాలు చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆవాసం ఏర్పాటు చేసుకొని ఉంటున్న వృద్ధుడిని సమీపంలో ఉంటున్న వెంకటయ్య ఆదరిస్తున్నాడు. అయితే గురువారం వృద్ధుడు మృతి చెందడంతో యువనేస్తం ఫౌండేషన్ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు దహనసంస్కారాలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు నరాల కృష్ణ, అంకిపల్లి బంగారు బాబు, శ్రీకాంతు, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో టోల్‌ప్లాజా వద్ద తనిఖీ


టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న సీఐ, ఎస్సై

టంగుటూరు: ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై వి.నాగమల్లేశ్వరరావులు గురువారం స్థానిక టోల్‌ప్లాజా వద్ద ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాటడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎటువంటి నేరాలు జరగకుండా అనుమానితులను విచారించడం, గస్తీ తిరగడం వంటివి నిరంతరం చేస్తామన్నారు. అనంతరం టోల్ ప్లాజా వద్ద డ్రగ్స్, గంజాయిని అరికట్టేందుకు వైజాగ్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వచ్చే కార్లు, ప్రైవేట్ ట్రావెల్స్, పలు రకాల వాహనాలను డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించారు.

పాలకుల్లో కొరవడిన స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి

సీఎస్‌పురం(పామూరు): కేంద్రంలోని బీజేపీ పాలకులు స్వాతంత్ర్య స్ఫూర్తి కొరవడిందని సీపీఐ మండల కార్యదర్శి పెద్దమస్తాన్, రైతుసంఘం నాయకులు మోరెబోయిన వెంకటకొండయ్య యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం సీపీఐ శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌వద్ద పార్టీ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాన్ని పాలిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ లౌకికదేశమైన భారతదేశాన్ని హిందూదేశంగా మార్చాలని సంఘపరివార్ రహస్య అజెండాను అమలుచేయాలని పథకం ప్రకారం ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భైరవకోనలో చింతలచెరువు ప్రత్యేక పూజలు


భైరవకోనలో పూజల్లో పాల్గొన్న చింతలచెరువు, నేతలు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనను గురువారం రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకులు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు సందర్శించారు. సిద్దు వెంకటరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, తమ్మినేని ఫణీంద్రారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ పునఃప్రతిష్ట


మిట్టపాలెంలో నాగేంద్రస్వామి విగ్రహప్రతిష్ట చేస్తున్న అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో గురువారం సుబ్రమణ్యేశ్వరస్వామి విగ్రహ పున:ప్రతిష్టా ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు మంకాల శివప్రాసాద్‌శర్మ పూజలు నిర్వహించి వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పునః ప్రతిష్ట గాంచారు.

కొండపిలో 34 మిల్లీమీటర్ల వర్షపాతం

కొండపి: మండలంలో 34 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ పి.మురళి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. కొండపిలో వీధులు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు నిలిచింది. పొలాల్లో నీరు నిలవడంతో పొగాకు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండపిలో జెండా చెట్టు సెంటర్ వద్ద కాలువలు నిండి రోడ్డు మీదకి నీళ్ల ప్రవహిస్తున్నాయి. కొండపిలోని పొదిలి రోడ్డులో, జాళ్లపాలెం రోడ్డులో, సచివాలయం వద్ద వర్షం నీరు రోడ్డుమీద నిలిచాయి.